

మామిడి రైతు కంట కన్నీరు..

- గుజ్జు ఫ్యాక్టరీల వద్ద బారులు తీరిన వాహనలు
- బంధువులు, సిఫారసు ఉన్న వారికే టోకెన్లు..
- తోటలోనే కుళ్ళిపోతున్న తోతాపురి
- దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు

మామిడి రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. కష్టనష్టాలకు ఓర్చుకునిమామిడి తోటలను సాగు చేస్తున్నా.. తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. పండించిన పంటను అమ్ముకోవడానికి వారాలు తరబడి గుజ్జు పరిశ్రమల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. నిద్రాహారాలు మాని పరిశ్రమల వద్ద నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య రైతు మామిడి పంటను అమ్ముకోలేక పండిన మామిడి కాయలను అలానే వదిలేస్తున్నారు. ఏడాదిపాటు కష్టపడి పెంచిన పంట కళ్ళముందే కుళ్ళిపోతుంటే ఆ రైతు పడుతున్న కష్టం వర్ణనాతీతం.



ఫుడ్ అండ్ నీడ్స్ ఫ్యాక్టరీ గేటు ముందు పర్మిట్ల కోసం రైతుల పడిగాపులు

టోకెన్లు జారీ చేయబడవు అంటూ ఆర్ఎంఎం ఫ్యాక్టరీ ఎదుట నోటీస్

ప్రజాశక్తి- యంత్రాంగం: ఏటా నష్టాలతో అల్లాడుతున్న మామిడి రైతులు ఈ ఏడాది దిగుబడి పెరిగిన... దిగులే మిగులుతోంది. గతేడాది కంటే ఈ ఏడాది మామిడి దిగుబడి చిత్తూరు జిల్లాలో మూడు రెట్లు పెరిగినట్లు ఉద్యానవన శాఖ అంచనా వేస్తోంది. 40 వేల హెక్టార్లు తోతాపురి రకం 25 మండలాల్లో సాగు అయ్యింది. ఈ ఏడాది ఐదు లక్షల టన్నులు మామిడి దిగుబడి వచ్చింది. ఇంత భారీ స్థాయిలో మామిడి దిగుబడి పెరిగిన ధరలు పతనం, జ్యూస్ ఫ్యాక్టరీలు కొనుగోలు చేయకపోవడం వల్ల జిల్లాలోని మామిడి రైతులు ఎన్నడూ లేనని విధంగా జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల ఎదుట టోకెన్ల కోసం రాత్రింబవళ్లు ఎదురు చూడాల్సిన దయనీయ పరిస్థితి జిల్లాలో నెలకొంది.. టోకెన్ల కోసం గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులను ఫ్యాక్టరీల చుట్టూ తిప్పుకోవడంతో ఆగ్రహించిన మామిడి రైతులు బంగారుపాళ్యం, జీడీ నెల్లూరు, గుడిపాల జ్యూస్ ఫ్యాక్టరీల ముందు నిరసనలు ఆందోళనకు దిగారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు..

దిగుబడి పెరిగినా.. దిగులే..

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో 35 మ్యాంగో గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. వీటిల్లో 27 మామిడి గుజ్జు పరిశ్రమలు ఈ ఏడాది మామిడికాయల నుండి గుజ్జును తీసే ప్రాసెస్ నడుస్తోంది. వివిధ కారణాలతో 8 మామిడి గుజ్జు పరిశ్రమలు నడవడం లేదు. అలాగే జిల్లాలో మూడు మార్కెట్ యార్డులు (చిత్తూరు, దామలచెర్ల, బంగారుపాళ్యం) రైతుల నుండి మామిడిని కొనుగోలు చేస్తున్నాయి వీటితోపాటు 37 ర్యాంపుల ద్వారా మామిడి రైతుల నుండి మామిడి కొనుగోలు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది తోతాపురి మామిడి దిగుబడి మూడు రెట్లు పెరిగింది. జిల్లాలోని 40,000 హెక్టార్ల నుండి దాదాపు 5లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు ఉద్యానవన శాఖ అంచనా వేసినప్పటికీ ఆ మేరకు గుజ్జు పరిశ్రమలను ముందుగా తెరిపించకపోవడంతో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పక్వానికి వచ్చిన మామిడిని గుజ్జు పరిశ్రమలకు తోలేందుకు మామిడి రైతులు గుజ్జు పరిశ్రమల ముందు పడిగాపులు పడాల్సి వస్తుంది.

కాయ రాలుతోంది... కనికరించండి

తనకున్న 1.50 ఎకరం మామిడి తోపులో ఈఏడాది పంట దిగుబడి బాగా వచ్చిందని దాదాపు 5 టన్నులు వచ్చే అవకాశం ఉందని యాదమరి మండలం కొట్టాలం గ్రామానికి చెందిన నాగరాజు తెలిపారు. తాను పండించిన మామిడి అమ్ముకునేందుకు టోకెన్ కోసం మూడు రోజులుగా తిరుగుతున్నట్లు తెలిపారు. మంగళవారం గుడిపాల ఫుడ్ అండ్ నీడ్స్ ఫ్యాక్టరీకి వెళితే వచ్చే నెల వరకు టోకెన్లు ఇచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారని, చిత్తూరు సమీపంలోని ఆర్ఎంఎం ఫ్రూట్స్ వద్దకు వచ్చిన వచ్చేనెల 5వ తేదీ వరకు టోకెన్లు ఇచ్చే పరిస్థితి లేదని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు వాపోయారు. 10 ఎకరాలకు ఒకే రకమైన టోకెన్, ఏకరం రెండెకరాలు ఉన్నవారికి ఒకే రకమైన టోకెన్ ఇవ్వడం వల్ల సన్న, చిన్నకారు రైతులు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోందని తక్కువ ఫలసాయం ఉన్న రైతులను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల్లో తన తోటలోని మామిడిని పోయకుంటే 80 నుంచి 90 శాతం పంట నేలరాలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటను అమ్ముకునే దిక్కులేదు..

తనకున్న నాలుగు ఎకరాలలో ఈ ఏడాది 10 ట్రాక్టర్ల పంట వచ్చే అవకాశం ఉందని ఈ పంటను ఎక్కడ అమ్ముకోవాలో దిక్కుతోచక అల్లాడుతున్నట్లు యాదమరి మండలం పండ్రపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు వాపోయాడు. తన పంటను అమ్ముకునేందుకు టోకెన్ల కోసం సోమవారం జీడి నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ, గుడిపాల మండలం ఫుడ్ అండ్ నీడ్స్, చిత్తూరు సమీపంలోని ఆర్ఎంఎం జ్యూస్ ఫ్యాక్టరీలను సంప్రదించిన ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల వరకు టోకెన్లు ఇచ్చే పరిస్థితి లేదని ర్యాంపుల వద్ద అమ్ముకుందామంటే తోతాపురి రకం టన్ను రూ.4 వేలకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. మామిడి పంట నేల రాలుతోందని ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేయడం లేదని ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయన్ని ఆలోచించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఫుడ్ అండ్ నీడ్స్ ఫ్యాక్టరీ ఎదుట నిలిచిపోయిన మామిడికాయల వాహనాలు



గేట్ బయట ఎదురు చూస్తున్న రైతులు

రైతులు ఎవరు ఆందోళన చెందొద్దు : కలెక్టర్ సుమిత్ కుమార్

యాదమరి (చిత్తూరు): జిల్లాలోని తోతాపూరి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశానిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తలు వలన మామిడి దిగుబడి పెరిగిందని, గత రెండు సీజన్‌లోను గుజ్జు నిల్వలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా రైతులకు న్యాయం జరిగేలా మద్దతు ధర కిలోకి రూ.12లకు కొనుగోలు చేయలని ఆదేశాలు ఇచ్చారని, రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా ప్రతి రైతు చివరి పంట వరకు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతులు ఎలాంటి తొందరపాటు లేకుండా పంట కోత కోయవద్దని, మామిడి పక్వానికి వచ్చిన తరువాత కోయాలని తెలిపారు. రైతులు మండీలు, ట్రేడర్స్ గుజ్జు పరిశ్రమల దగ్గరికి తొందరపడి వెళ్ళవద్దని దిగుబడు రాకముందే కోయవద్దు అని సూచించారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

రైతుల సందేహాలు నివృత్తికి హెల్ప్ లైన్ ఏర్పాటు

జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విద్యాధరి




యాదమరి (చిత్తూరు): చిత్తూరు జిల్లాలో మామిడి రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, అపోహలను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తోతాపూరి మామిడి కాయల కొనుగోలు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 98వేల ఎకరాలలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి పండిస్తున్నారన్నారని, పంట దిగుబడి క్రమంగా పెరుగుతున్నదన్నారు. మామిడి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో తోతాపురి మామిడి కిలో రూ.12లుగా ధర నిర్ణయిస్తూ జూన్ 6న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని, ఇందులో గుజ్జు పరిశ్రమలు రూ.8లు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.4లు మద్ధతు ధర ను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందని తెలిపారు. 38 ర్యాంపులు, 2 మండీల వద్ద అమ్ముకునే రైతులకు కూడా ప్రభుత్వం రూ.4ల మద్ధతు ధరను అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడానికి జిల్లాలో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి మండలాలకు మండల స్థాయి ఇంచార్జ్‌లను నియమించడం జరిగిందని, ప్రొసెసింగ్ యూనిట్‌లు ఎక్కువగా ఉన్న పూతలపట్టు, తవణంపల్లి, గుడిపాల మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ఇంచార్జ్‌లుగా నియమించి పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియను జిల్లా స్థాయిలో పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లా సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు షిఫ్ట్‌లలో సిబ్బంది పని చేస్తారన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా08572-242777, 9491077325 హెల్ప్ లైన్‌కు సంప్రదించాలని కోరారు. తోతాపూరి మామిడి కొనుగోలుకు సంబంధించి రైతులు ఆందోళనకు గురికావడం జరుగుతున్నదని, మామిడి ధరను క్రమంగా రూ.6లకు తగ్గకుండా చూస్తున్నామని, రైతులు గుర్తించాలన్నారు. గత ఎనిమిది రోజుల నుంచి తోతాపూరి మామిడి కాయలు 38 వేల టన్నులు ఫ్యాక్టరీలకు సరఫరా చేయడం జరిగింది. ప్రతి రైతు పండించిన చివరి మామిడికాయ వరకు, ఆగస్టు సీజన్ వరకు సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రైతులు వెంటవెంటనే కాయలు కోసి ఫ్యాక్టరీలకు తరలించడం కాకుండా అందరూ రైతులకు అవకాశం వచ్చేలా సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



తోటలోని చెట్లపైనే మాగిపోతున్న కాయలు

కాయల నుంచి నీళ్లు కారుతున్నాయి..

- సుబ్రహ్మణ్యం రెడ్డి, రైతు, అగ్గి చేనుపల్లి గ్రామం, వెదురుకుప్పం మండలం



తోతాపురి మామిడికాయలు ట్రాక్టర్ ట్రాలీలో నింపి పట్టా కట్టుకొని ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్లాము. అక్కడ అన్ లోడ్ చేసేందుకు ఒక రోజు నుంచి రెండు రోజులు అవుతోంది. ట్రాలీలో వున్న ఉన్న కాయలు చాలావరకు మాగిపోతాయి. దీంతో ట్రాలీ నుంచి నీళ్ల లాగా కిందకు కారుతున్నాయి. బాగా మాగిన కాయలు చాలావరకు ఫ్యాక్టరీ లోపల గ్రేడింగ్ చేస్తారు. ఫ్యాక్టరీ వాళ్ల త్వరగా అన్‌లోడింగ్ చేయకపోవడం వల్ల కాయలు చాలా వరకు నష్టపోతున్నాం..

నమ్ముకున్నాం.. మునిగిపోయాం..


- జాన్ సుందరం, మామిడి రైతు, తూగుండ్రం, జీడీ నెల్లూరు మండలం.



ఈ సంవత్సరం మా వ్యవసాయ పొలంలో మామిడి దిగుబడి బాగా వచ్చింది. సుమారు 25 టన్నుల వరకు అంచనావేశాం.. కేజీ రూ..10 అమ్మినా రూ.2.5 లక్షల వరకు సొమ్ము వచ్చేది. కుటుంబ అవసరాలు తీరేది. వ్యాపారులు ఎవరూ తోతాపురి కాయలను కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. ఫ్యాక్టరీ వాళ్ల రూ.4 నుంచి రూ.5 వరకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఏమీ అర్థం కాలేదు. ఫ్యాక్టరీ ముందు పడిగాపులు కాయాల్సిందే.. పంటను నమ్ముకుని మునిగిపోయాం.. అప్పులే మిగిలాయి.. ప్రభుత్వం ఆదుకోవాలి..

మామిడి కాయలు పండి రాలిపోతున్నాయి..

- డివి డిల్లెయ్య, మామిడి రైతు, కొత్తపల్లి గ్రామం , సర్పంచ్, ఎస్ఆర్ పురం మండలం



గత ఏడాది కన్నా ఈ ఏడాది మామిడి తోటలో మంచి కాపు వచ్చింది. కాపును చూసి వ్యాపారులు ధర మాట్లాడుకుని కొంచెం అడ్వాన్స్ అమౌంట్ ఇచ్చి వెళ్లిపోతారు. తీరా కాపు కోత సమయంలో మామిడి రేట్లు పడిపోవడంతో రైతులు దగ్గర తీసుకున్న వ్యాపారులు తిరిగి మామిడి తోటకు రారు. కాయలు పండి రాలిపోతున్నాయి. సరే కోసి ఫ్యాక్టరీ పంపించాలనుకుంటే కనీసం కోత కూలి కూడా రావడం లేదు. టోకెన్ సిస్టం పెట్టారు.. టోకెన్ దొరకక కాపుకొచ్చిన కాయలను అమ్మే అవకాశం లేక పండిన పంట చెట్లలోనే రాలిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో వున్నాం..!

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని ఫ్యాక్టరీలను సీజ్ చేయాలి

- వాడ గంగరాజు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, జిల్లా ఉపాధ్యక్షులు

యాదమరి, తవణంపల్లి, బంగారపాళ్యం, జీడీ నెల్లూరు మండలాల్లో ఉన్న మామిడి గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నిర్ణయించిన ధరను బేఖాతర్ చేస్తూ కేవలం రూ.4లు మాత్రమే ఇస్తామని, అది కూడా ఫిబ్రవరి తర్వాత ఇస్తామని.. ఇష్టముంటే తోలండి లేకపోతే లేదు.. అని బహిరంగంగా మాట్లాడుతున్నారు. పంట పక్వానికి వచ్చిన మామిడికాయలు నెలరాలిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏమీ దిక్కుతోచని పరిస్థితిలో రైతులు అనివార్య పరిస్థితిలో కోత కోస్తున్నారు. కలెక్టర్ జిల్లాలో మంచి ప్రయత్నం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులను ఇబ్బంది పెడుతున్న ఫ్యాక్టరీలను సీజ్ చేయాలి. మామిడ రైతులకు న్యాయం జరిగేలా త్వరగా చర్యలు తీసుకోవాలి.

బయట మార్కెట్లో తోతాపురి కిలో రూ.3లే..

పండిన పంట అమ్ముకోవడానికి అవస్థలు

యాదమరి (చిత్తూరు): చిత్తూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతుంది. ఇందులో తోతాపురి 39 895 హెక్టార్లు, నీలం 5818 అల్ఫోనో3127, బెనిష 3895, మల్లిక 1 740 హెక్టార్లు మరియు ఇతర రకాలు 1,526 హెక్టార్లలో సాగులో ఉంది. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా తోతాపూరి రకం సాగుతుంది ఈ కాయలు 90శాతం దాకా పక్కవానికి వచ్చాయి. టేబుల్ రకాలు మాత్రం రైతులు కోత కోసి మార్కెట్ ఫ్యాక్టరీలకు తరలించారు. తోతాపురి పంటను ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు మొగ్గ చూపడం లేదు దీంతో రైతులు రోడ్డెక్కారు.

పెట్టుబడి కూడా రావడం లేదు..

- కోసూరు ఉమాపతి, కసిరాల గ్రామం యాదమరి మండలం



తోతాపురి రకం బయట మార్కెట్లో టన్ను ప్రస్తుతం రూ.3వేలకు పడిపోయింది. ఇలా అయితే కోత కూలి, బండి బాడుగ, డబ్బులు కూడా రాని పరిస్థితి. ఏడు ఎకరాల మామిడి తోట ఉండగా ఇప్పటికే మందులు సస్యరక్షణ చర్యలకే రెండు లక్షలు ఖర్చు పెట్టాము పెట్టిన పెట్టుబడిలో సగం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

కాయలు నేలరాలిపోతున్నాయి..

- సిద్ధయ్య మండడి, కె గొల్లపల్లి గ్రామం



మామిడి కాయలు బాగా పండిపోయి తోటలోనే రాలిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి కాయ బాగా సైజు పెరగడంతో కాయ బరువు పెరిగి పండి పగుళ్లు ఏర్పడి రాలిపోతున్నాయి. పంట దిగుబడి బాగా వచ్చింది ఈ సారి ఆదాయం వస్తుందని ఎదురుచూస్తున్న సందర్భంలో మామిడ కాయలు కొనేందుకు వ్యాపారుల సైతం ముందుకు రావడం లేదు. బయట మార్కెట్లో అమ్ముదాంటే కేవలం తన్ను రూ.3వేలు మాత్రమే పలుకుతున్నది.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

పూతలపట్టు: మామిడి రైతుల పట్ల గుజ్జు పరిశ్రమల యాజమాన్యుల తీరు విచాకరంగా ఉంది. గుజ్జు పరిశ్రమల యాజమాన్యం బంధువులకు, సిఫారసు ఉన్నవారికి మాత్రమే టోకెన్లు పంపిణీ చేసి మామిడి పంటను దిగుమతి చేసుకుంటున్నారు. సామాన్య రైతు మాత్రం తమ పంట నమ్ముకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఒకవేళ టోకెన్ తీసుకున్న పరిశ్రమల వద్ద రోజులు తరబడి నిద్రాహారాలు మాని వేచి ఉండాల్సిన పరిస్థితి. ఒక్క కర్మాగారంలో రోజుకి 15 టోకెన్ల వరకు మాత్రమే ఇస్తుండడం ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో మొత్తం 34 మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఈసారి జిల్లా వ్యాప్తంగా నాలుగున్నర లక్షల టన్నుల మామిడి దిగుబడి రావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అధిక దిగుబడి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు తోతాపురి మాత్రం ఉండడంతో ఈ కాయలు అమ్ముకోవడం రైతులకు కష్టంగా మారింది.

నిల్వలు ఉన్న జ్యూస్..

గత ఏడాది క్రషింగ్ చేసిన జ్యూస్ అమ్ముడుకాకపోక పరిశ్రమలలో పెద్దఎత్తున పల్ప్ నిల్వలు ఉండడంతో ఈ ఏడాది గుజ్జు పరిశ్రమలు పంటను దిగుమతి చేసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇందులో భాగంగానే నేడు చాలా వరకు పరిశ్రమలు ఇదివరకు ప్రారంభం కూడా చేయలేదు. ఉన్న ఫ్యాక్టరీలు కాస్త పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదు. రకాలకు తప్ప తోతాపూరికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఇప్పటికే చాలావరకు పంటను రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఆలస్యం అయ్యే కొద్ది మామిడికాయలు చెట్లలోని కుళ్ళి రాలిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ఈసారి మామిడి మద్దతు ధర గురించి రైతులు పెద్దగా పట్టించుకోవడం లేదు. వచ్చిన కాడికి రాని అన్న విధంగా పంట అమ్ముకుంటే చాలని అనుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఫ్యాక్టరీల యాజమాన్యులతో సమావేశం ఏర్పాటు చేసి కిలో రూ.8లకు తగ్గకుండా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రూ.4లు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కానీ ఎక్కడ కానీ రూ.6లకు మించి కొనుగోలు చేయడం లేదు. అయినా మామిడి కాయలను సరఫరా చేయడానికి రైతులు ఫ్యాక్టరీల వద్ద బారులు తీరుతున్నారు. ధరలు లేకపోయినా ఉన్న పంటను కాస్త అమ్ముకుంటే చాలని.. ఎందుకైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మామిడి రైతులకు కోరుతున్నారు.



ఫ్యాక్టరీ ఎదుట నిలిచిపోయిన వాహనాలు

జైన్ మామిడి ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని జైన్ ఫ్యాక్టరీని పరిశీలించిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫ్యాక్టరీలోని పలు విభాగాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లను ఫ్యాక్టరీలో గుజ్జు నిల్వ చేసే సామర్థ్యాన్ని సమీక్షించి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమావేశమై ప్రాసెసింగ్ నిల్వ ప్రక్రియలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న గోడ, గేట్లు, సీసీ కెమెరాలు, నైట్ గార్డుల విధులు తదితర అంశాలను పరిశీలించిన పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్ సేఫ్టీ కిట్‌లు, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు ఉండాలన్నారు. అలాగే, రైతులు వచ్చేవేళ ట్రాఫిక్ నియంత్రణకు కావలసిన ఏర్పాట్లు ఉండేలా చూడాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించి అవినీతికి అవకాశం లేకుండా వ్యవస్థలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసే సామర్థ్యం, ప్రాసెసింగ్ యూనిట్లు, రీప్యాకింగ్, ఎగుమతి చర్యల గురించి పూర్తి స్థాయిలో అధికారులతో కలిసి ఎస్పీ సమీక్షించారు. గంగాధర నెల్లూరు సిఐ శ్రీనివాసంతి, జైన్ ఫ్యాక్టరీ మేనేజర్ దిలీప్, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.



డిఎం అండ్ హెచ్ఓకి ఆశా వర్కర్ల సమ్మె నోటీస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు ఆశ వర్కర్స్ యూనియన్ తరపున పాల్గొంటామని మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుధారాణికి నోటీసు అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ కార్మికులకు ఉన్న చట్టాలను నీరుగాచే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకుని రావడం దారుణమని, లేబర్ కోడ్లను రద్దు చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని, ఆశ వర్కర్స్‌కి కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, కార్మికుల కర్షకుల సమస్యలను సానుకూలంగా కేంద్రం ఆలోచించాలని అన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గంగ మాట్లాడుతూ జిల్లాలోని ఆశా వర్కర్లకు డ్యూటీ కాని పనులకు ఇస్తున్నారని అధికారులు వివక్ష చూపుతున్నారని ఈ తీరును మానుకోవాలన్నారు.



వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

మానవత్వం మరిచి మహిళపై దాడి

- బాధితురాలిని ఫోన్‌లో పరామర్శించిన సిఎం
- రూ.5 లక్షల ఆర్థిక సాయం, పిల్లల చదువుకు హామీ
- అన్ని విధాలా అండగా ఉంటానని సిఎం భరోసా



కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో వున్న శిరీషను పరామర్శించిన ఐద్వా చిత్తూరు జిల్లా కన్వీనర్ భువనేశ్వరి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో తమకు బాకీపడ్డ సొమ్ము చెల్లించలేదంటూ అదే గ్రామానికి చెందిన కొంతమంది శిరీష అనే మహిళను చెట్టుకు కట్టి కొట్టిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. నారాయణపురంలో కాపురం ఉన్న శిరీష దంపతులు గ్రామంలోని కొందరి వద్ద అప్పులు చేశారని, ఈ అప్పు చెల్లించలేక బాధితురాలి భర్త ఊరు వదిలి వెళ్లిపోయాడు. దీంతో శిరీష పక్క గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చూసుకుంటుంది. సోమవారం పిల్లలకు సంబంధించి సర్టిఫికెట్లు స్కూల్ నుంచి తీసుకోవడానికి నారాయణపురంకు వచ్చింది. దీన్ని గమనించిన అప్పుల వారు ఆమెను అత్యంత దారుణంగా కొట్టి చెట్టుకు కట్టేసి కొట్టారు. ఓ పక్క బిడ్డ ఏడుస్తున్నా కనికరించలేదు.. పైగా అప్పు చెల్లించకుంటే చంపేస్తామంటూ బెదిరించారు. దీనికి తోడు వారు చేస్తున్న దారుణాన్ని ఫోన్‌లో వీడియో తీశారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. ఇది గమనించిన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, బాధితురాలికి రక్షణ కల్పించి ఆమెను చికిత్స ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు..

నారాయణపురంలో చోటుచేసుకున్న ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ పార్థసారథి మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో అప్పులు చేసి, వాటిని తీర్చకుండా బాధితురాలు కుటుంబంతో ఊరు వదిలి వెళ్ళిపోయినట్టు తెలిపారు. అయితే తమ పిల్లల చదువుతున్న పాఠశాలలో వారి ధ్రువపత్రాలను తీసుకోవడానికి సోమవారం గ్రామానికి రావడం జరిగిందని, వారిని గమనించిన అప్పు ఇచ్చిన వారు తనకు రావలసిన సొమ్ము వసూలు చేసుకునే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్టు తెలిపారు. అయితే మహిళపై దాడికి పాల్పడిన మునెప్ప, రాజా, వెంకటమ్మ, జగదీశ్వరి అనే నలుగురుని పోలీసులు అదుపులోనికి తీసుకుని వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్టు డీఎస్పీ తెలిపారు.

స్పందించిన ముఖ్యమంత్రి

నారాయణపురంలో మహిళపై జరిగిన దారుణంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మహిళపై జరిగిన దాడిని ఖండించారు. బాధిత మహిళకు రక్షణ కల్పించాలని, బాధితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి స్వయంగా బాధితురాలితో మాట్లాడుతూ ఆమెకు అండగా ఉంటామని, అధైర్య పడవద్దు అంటూ మనోధైర్యాన్ని కల్పించారు.

అప్పు మాఫీ చేయాలి..

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు




అప్పు వసూళ్లలో భాగంగా భౌతిక దాడులకు దిగిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కుప్పంలో జరిగిన ఘటనపై ఆయన స్పందిస్తూ స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళపై దాడి జరగడం దారుణమన్నారు. అప్పు వసూళ్లకు చట్టరీత్యా చర్యలు చేపట్టాలి కానీ, మహిళపై భౌతిక దాడి చేయడం అమానుషమన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు అప్పు రద్దు చేసి, బాధితురాలికి నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

శిరీషను ఫోన్‌లో పరామర్శించిన సిఎం చంద్రబాబు

రూ.5 లక్షల ఆర్థిక సాయం, పిల్లల చదువుకు హామీ

అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా



కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమె చెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని సిఎంకి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి... అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.


సబ్సిడీ దాణాను పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీ పశువుల దాణా సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం 50 శాతం రాయితీతో అందిస్తున్న పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల పశువైద్యాధికారిణి డాక్టర్ సాయిసుధా కోరారు. గుడిపాల మండల కేంద్రంలో మంగళవారం సబ్సిడీ పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం పాడి రైతులకు దాణా రాయితీపై అందిస్తుందన్నారని, పశువుల దాణా కావలసిన రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు హేమాద్రి నాయుడు, రవి నాయుడు, వెంకటేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.


వసతి గృహాలను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్

వసతి గృహాల తనిఖీ

ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని వసతి గృహాలను మండల ప్రత్యేక అధికారి విజయ్ కుమార్ తనిఖీ చేశారు. మండల కేంద్రమైన చౌడేపల్లిలోని బాలికల ఎస్‌సి బాలుర బిసి వసతి గృహాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల వసతి గృహంలో నిర్వహిస్తున్న పనులను పర్యవేక్షించారు. మరుగుదొడ్లు, వంటగది, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య చర్యలు పాటించాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు . అనంతరం వసతి గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఈ సోమశేఖర్, శ్రీనివాస్, ఏఈఈలు సురేష్ రెడ్డి, చందన, సిబ్బంది పాల్గొన్నారు.


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండల కేంద్రంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యా ర్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు ఇతర సామగ్రిని రొంపి చర్ల ఎంపీడీవో ఎస్ మధుసూదన్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులతో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యాసామగ్రిని సక్రమంగా వినియోగించుకుని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ నాయకులు అంజద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు

పాఠశాల కొనసాగించాలి

అగ్రహారం దళితవాడ వాసుల నిరసన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ప్రాథమిక పాఠశాలను తమ గ్రామంలోనే కొనసాగించాలని అగ్రహారం దళితులు మంగళవార నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ అగ్రహారం దళితవాడలో సుమారు 50 సంవత్సరాలుగా పాఠశాల ఉందని, ప్రస్తుతం తమ పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఉండగా ఇక్కడ నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త వెంకటాపురం స్కూలుకు మూడు, నాలుగు, ఐదు తరగతులను మార్చడంతాము ఒప్పుకోమంటూ గ్రామస్తులు అగ్రహారం దళితవాడ పాఠశాల వద్ద మంగళవారం విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తమ గ్రామంలోని పాఠశాలను ప్రారంభించాలని వాళ్లు డిమాండ్ చేశారు.

నిరసనలకు అనుమతి తప్పనిసరి: ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజాస్వామ్యంలో ప్రజలకు అభిప్రాయం వ్యక్తపరచడం, శాంతి యుతంగా నిరసన తెలపడంలో కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా పెద్ద ఎత్తున సమూహాలు గుమికూడే కార్యక్రమాలు, ఊరేగింపులు, ఆందోళనలకు ముందు డిఎస్‌పి స్థాయి పోలీసు అధికారి అనుమతి తీసుకోవడం అవసరమని ఎస్‌పి మణికంఠ చందోలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలగకుండా, ప్రజల నిత్య జీవితానికి అంతరాయం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. నిరసన నిర్వహించాలనుకునే వ్యక్తులు, సంస్థలు కనీసం ఒక వారం ముందు సంబంధిత పోలీస్ స్టేషన్లో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందులో కార్యక్రమ తేదీ, సమయం, ప్రదేశం, పాల్గొనేవారి అంచనా సంఖ్య, మైక్ వాడకం వంటి వివరాలు తెలపాలన్నారు. పోలీసులు పరిస్థితిని సమీక్షించి అనుమతిని జారీ చేస్తారని పేర్కొన్నారు. ఊరేగింపు చేపట్టాలనుకుంటే ముందే మార్గాన్ని ఖరారు చేయాలని, ఆ మార్గం కీలకమైన ట్రాఫిక్ జంక్షన్లను దాటి పోకూడదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులతో సమన్వయం చేయాలని, ఎలాంటి ఘర్షణలు, ఆందోళనలకు చోటు లేదని, రాళ్ల దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, పోలీసులపై దాడులు లాంటి చర్యలు చట్టవిరుద్ధం అన్నారు. కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆశ కార్యకర్త పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నెమ్మ గారి పల్లి పంచాయతీలో రెండు, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోనేటి వీధిలో ఒక ఆశా కార్యకర్త పోస్ట్ భర్తీ చేసేందుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మండల వైద్య సిబ్బంది తెలిపారు. పదవ తరగతి పాసై 25 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోబడి వయస్సు కలిగి ఉండాలని, వివాహిత అయి ఉంటే ప్రాధాన్యం, వితంతువులకు ప్రాధాన్యం, విలేజ్ అండ్ హెల్త్ శానిటేషన్ కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని అర్హత కలిగి అభిరుచి కలిగిన వారు కమిటీ ద్వారా దరఖాస్తు పూర్తి చేసి కమిటీకి అందించాలని తెలిపారు.


పిల్లలకు నీతి పుస్తకాలు పంపిణీ చేసిన తులసీనాథం నాయుడు

నీతి పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -గంగవరం : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నీతి పద్యాలు పుస్తకాలను మంగళవారం కీలపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు పి తులసినాథం నాయుడు మాట్లాడుతూ నీతి పద్యాలు చదువుతోపాటు విలువలను, క్రమశిక్షణను నేర్పిస్తాయన్నారు. విలువలు, క్రమశిక్షణ లేని చదువు వ్యర్థమన్నారు.


వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పలమనేరు: వెన్నుపోటు పుస్తకాన్ని రూరల్ మండల వైసిపి అధ్యక్షుడు బాలాజీ నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో రూరల్ మండల వైసిపి అధ్యక్షుడు బాలాజీ నాయుడు ఆధ్వర్యంలో 160 పేజీల జగన్ అంటేనే నమ్మకం.. చంద్రబాబు అంటేనే మోసం' అంటూ ముద్రించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నీరుగార్చడమే కాక మోసం చేస్తున్నారంటూ విమర్శించారు. ప్రజలకు అధికారం రాకముందు చంద్రబాబు ఇచ్చిన హామీలతో కూడిన ఈ పుస్తకాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


డాక్టరు సునీల్‌రాజ్‌ను సన్మానిస్తున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది

ఘనంగా సునీల్ రాజ్ జన్మదినం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఆ కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం బిసిఎన్ విద్యాసంస్థల బోధన, బోధ నేతర సిబ్బంది సునీల్ రాజ్‌ను గజమాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుల జన్మదిన పురస్కరించుకొని విజలాపురం, రాళ్లబూదుగూరు సోషల్ వీల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌కు ఆర్‌ఓ ప్లాంట్‌ను, రామకుప్పం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌కు 30 చైర్స్‌ను విరాళంగా అందించారు. గుడుపల్లి మండల పరిధిలోని విక్టరీ బోర్డింగ్ పాఠశాలలో విద్యార్థులకు ఆహారం అందించారు. ముఖ్యంగా 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలతో అభినందించారు. తమ విద్యాసంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున గ్రూప్ ఇన్సూరెన్స్ ను ప్రకటించారు.

ఏనుగుల దాడి

మామిడి తోపు ధ్వంసం

ప్రజాశక్తి -గంగవరం (పలమనేరు రూరల్): పలమనేరు రూరల్ మండలం ముసలమడుగు గ్రామంలోని ఉమా శంకర్ నాయుడుకు చెందిన ఐదు ఎకరాల మామిడి తోపును సోమవారం రాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయని రైతు విచారం వ్యక్తం చేశాడు. తాను రాత్రి 10 గంటల వరకు తోట దగ్గరే ఉన్నానని ప్రస్తుతం మామిడి తోపు కోత దశలో ఉందని ఈ పరిస్థితుల్లో ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేయడంతో అప్పులు పాలయ్యే పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశాడు . మంగళవారం అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ధ్వంసం చేసిన పంటను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికల పంపుతామని తెలిపారు. రైతు ఉమాపతి నాయుడు ప్రభుత్వం స్పందించి నాకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించండి

ప్రధానోపాధ్యాయులు శివరాజా

ప్రజాశక్తి -సోమల: బడి ఈడుకు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని సోమల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజా అన్నారు. మండల కేంద్రమైన సోమలలో పాఠశాల సిబ్బంది బడిబాటలో భాగంగా ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల ఇళ్లకు మంగళ వారం వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఒకటవ తరగతిలో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల ప్రభుత్వం స్కూలు బ్యాగు, యూనిఫామ్, బెల్టు షూలు, మధ్యాహ్నం భోజనం, పాఠ్య పుస్త కాలు ఉచితంగా అంది స్తోందని ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని విద్యార్థులకు వారి భవిష్యత్తుకు మంచిబాటలు వేయాలని సిబ్బంది తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, బేబీ, వసీం తాజ్, రామ్మోహన్, ఇంది రాంబ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


పిల్లలను ఒకటో తరగతిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

వైసిపి రాజకీయ రంగు తగదు: టిడిపి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ప్రతిదానికి వైసిపి రాజకీయ రంగు పులమడం తగదని టిడిపి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయడంపై తెలుగు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వారు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఎస్ ఆర్‌టిసి ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. తల్లికి వందనం అమలుతో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని వైసిపి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. తల్లికి వందనం పథకంలో రెండువేల రూపాయలు నేరుగా లోకేష్ బాబు ఖాతాలో జమ అయ్యిందంటూ వైసిపి నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి తనపై ఆరోపణలను 24 గంటలలో రుజువు చేయాలని సవాలు విసిరినా వైసిపి నిరూపించలేకపోయిందన్నారు. మంచిని ఓర్వలేని వైసిపి పేటీఎం బ్యాచ్ విష ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ మూల ఏది జరిగినా వాటికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని, చివరకు రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘటనలలో ఓ మహిళపై దాడి జరిగితే బాధితురాలికి అండగా నిలవాల్సిన నాయకులు ఆ ఘటనకు రాజకీయ రంగు పులమడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి తన నియోజక వర్గంలో జరిగిన ఘటనపై వెంటనే స్పందించారన్నారు. స్వయాన ముఖ్యమంత్రి ఎస్పితో మాట్లాడుతూ బాధితురాలికి రక్షణ కల్పించడమే కాకుండా నిందితులు ఎంతటి వారైనా చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, కడా కమిటీ సభ్యురాలు సుగుణమ్మ, పురపాలక సంఘం మహిళా అధ్యక్షురాలు శారదమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు వసంతమ్మ, ప్రధాన కార్యదర్శి తిరుమగళ్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యాలే మామిడి రైతుల దుస్థితికి కారణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గత వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్లే జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని, ఇదే అదునుగా ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విమర్శించారు. మామిడి రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాలు అమలు కాలేదని చిత్తూరు వైసిపి నాయకుడు విజయానంద రెడ్డి చేసిన ఆరోపణలపై చిత్తూరు ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. గత వైసిపి ప్రభుత్వం అడ్డదారులకు పోయి, మామిడి గుజ్జు పరిశ్రమల ఎగుమతి వ్యవహారాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఎగుమతి సక్రమంగా లేకపోవడం వల్ల ప్రస్తుతం పరిశ్రమల వద్ద పల్ప్ భారీగా నిల్వలు పేరుకుపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మామిడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో కనీసం మద్దతు ధరలు రూ. 8గా ప్రకటించి రూ.4 అదనంగా రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి- యాదమరి: ప్రజలు డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ వివరించారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొటాల గ్రామంలో ప్రజలకు వాంతులు విరోచనాలపై మంగళ వారం అవగాహన కల్పించారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా చిరుజల్లులు, దీంతో పాటు మామిడిపళ్ల సీజన్లో వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా ప్రజలు వాంతులు, విరోచనాలు బారిన పడతారని ఇది మనిషిని అలానే కృంగతీస్తుందన్నారు. కలుషితమైన నీరు తాగడం , చెడిపోయిన పళ్లను తినడం వల్ల కూడా విరోచనాలు అవుతాయని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించు కోవాలన్నారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఈనెల 31వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికైనా విరోచ నాలు అవు తుంటే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు జింక్ మాత్రలు కూడా అందిస్తారని ప్రతి ఒక్కరూ మంచి నీటిని తీసుకుని డయేరియా బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, ఆశా కార్యకర్తలు కళ, మీర కొటాల గ్రామస్తులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ


హామీలు అమలు ఏదీ?: ఎంపీపీ

ప్రజాశక్తి -సోమల: 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం..' కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు ఏమైంది?' అని వైసిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకులు ప్రజలకు ద్రోహం చేశారని వివరిస్తూ ప్రచురించిన బ్రోచరును ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వారపు సంత ఆవరణలో ఆవిష్కరించారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా ఇంతవరకు సూపర్ సిక్స్ అమలులో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఎన్నికలప్పుడు లెక్కలేనని హామీలను ఇచ్చి ఎన్నికలు కాగానే ప్రభుత్వం వచ్చినా హామీలను మరచి కాలయాపన చేస్తూ ద్రోహం చేస్తున్నారని వైసిపి నాయకులు విమర్శించారు. ప్రజల్లో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అన్న అభిప్రాయం ఏర్పడిందన్నారు. వైసిపి రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు బ్రోచర్ ఆవిష్కరణ చేసి ప్రజల్లోకి చంద్రబాబు చేస్తున్న మోసాలను తీసుకెళతామన్నారు. రాజన్న పాలన ప్రజా సంక్షేమం, శాంతిభద్రతలు జగన్ కాలంలో ఉండేవని ఇప్పుడు రాష్ట్రంలో అశాంతి, మహిళలపై దాడులు, పోలీసు ల అరాచకాలు రాజ్యమేలుతున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గంగాధరం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, వరదం వెంకటరమణ, శీలం భాస్కర్, బీసీ నాయకులు లక్ష్మీపతి, నాగేంద్ర ఖాదర్ బాషా పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

మామిడి కాయల పరిశీలన

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం ఎంజెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ని మామిడి ర్యాంపులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పులిచెర్ల మండలం మామిడి రైతులు పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కి ఫిర్యాదు చేశారు. స్పందించిన చల్లా బాబురెడ్డి వెంటనే స్పందించి మామిడికాయల ర్యాంపు వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకొని మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమ నిర్వాహకులు, ఫ్యాక్టరీ యజమానులు, ఇతర వ్యాపా రస్తులు, ఇబ్బందులు కలిగించకూడదని హెచ్చరించారు. వారిని మందలించి మామిడి కాయల రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులను నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. దీంతో మామిడి రైతులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల మండల తహశీల్దారు జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.


మామిడి రైతులతో మాట్లాడుతున్న చల్లారామచంద్రారెడ్డి

నాటు కోళ్ల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-తవణంపల్లి: టవనపల్లి మండల కేంద్రం శ్రీ శక్తి మండల మహిళ సమైక్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రైతులకు నాటు కోళ్ల పెంపకం, మునగ చెట్ల పెంపకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం తవణంపల్లి మండల వెటర్నరీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం అనారోగ్య కారణంగా ఉన్న బ్రాయిలర్ లేయర్ లింగాపురం కోడి మాంసం కన్నా నాటు కోళ్ల పెంచి వాటిని తినడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటుందని పశువర్ధక శాఖ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఒక కేజీ బరువు ఉన్న పక్షులు 16 కోళ్ల కోళ్లు డెవలపర్ ఫీడ్ 25 కేజీలు మెడికల్ కిట్ ట్రాన్స్‌పోర్టుతో కలిపి ఒక యూనిట్ ధర రూ ఐదు వేలు మండలి సమైక్య కార్యాలయం , ఎఫ్‌పిఓ కార్యాలయంలో చెల్లించి తీసుకోవాలని ప్రేమ్ లవ్లీ హుడ్ డిపిఎం యు ఏపీఎం రవి తెలిపారు. ఎంజిఎంఆర్ ఈజిఎస్ ద్వారా మునగ చెట్ల పెంపకంపై కూడా అవగాహన కల్పించారు. రైతులు ఎఫ్‌బిఓ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు వివోలు ఏడి ఆఫీసర్ డిఆర్‌డిఏ నుండి జీవి రమణ ఏపిఎం రవి, ఏపిఎం అరుణ, రూత్ ఎఫ్. టిఓలు ఫార్మర్స్ సీసీలు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేద్దాం: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - రామకుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని సంక్షేమ కార్యక్రమాల ఫలాలను ప్రజలకు అందివ్వాలని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల పనితీరుపై సమీక్షించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, పట్రా నారాయణ, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శిలు ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామ్మూర్తి, సీతాపతి, కృష్ణనాయక్, కామరాజు నాయక్, జెయి, జయశంకర్, కృష్ణప్ప, అల్లిశీనా, వెంకటరమణ పాల్గొన్నారు.



టిడిపి నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని ఆయన తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ అసమర్థత వల్ల రాష్ట్రం ఆర్థిక పరిస్థితి దివాలా తీసినా, సిఎం చంద్రబాబు అపార అనుభవం, పాలనా దక్షతతో తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని, ఫలితంగా సర్వత్రా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్య

అత్తింటి వేధింపులే కారణం?


ఆత్మహత్య చేసుకున్న విన్సీప్రియ

ప్రజాశక్తి- పలమనేరు: ఓ మహిళ అత్తింటి వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. పలమనేరు మున్సిపాల్టీ పరిధి గంటా ఊరు, ఇందిరమ్మ కాలనీలో అత్తవారి ఇంట్లో వుంటున్న పూతలపట్టు మండలానికి చెందిన విన్సీప్రియా (25) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది వుండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త పశుపతి లారీ డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడని, ఆమెకు ఏడు సంవత్సరాలు కొడుకు వున్నాడని పోలీసులు తెలిపారు. గతంలో పలుమార్లు ఇంట్లో కలహాలు చోటుచేసు కున్నాయని, అత్తింటి వేధింపుల కారణంగా తమ కుమార్తె మృతి చెందిందని విన్సీప్రియ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. కడుపు నొప్పికి తాళలేక మృతి చెందిందని భర్త ఫిర్యాదు చేశాడని పోలీసులు పేర్కొన్నారు. విన్సిప్రియ ఆత్మహత్యకు కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18 మందికి జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో 18 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఎదుట మంగళవారం హాజరుపరిచారు. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన ఏడుగురికి రూ.70 వేలు జరిమానా, బహిరంగంగా మద్యం సేవించిన 11 మందికి రూ.11 వేలు జరిమానా విధించారు. మొత్తం రూ.81 వేలు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సబ్ ట్రెజరీ ఆఫీసర్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

సమస్యలు పరిష్కరించండి..

సబ్ ట్రెజరీ ఆఫీసర్‌కు పెన్షనర్ల వినతి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కి స్వాగతం పలుకుతూ ట్రెజరీ పరిధిలో 1,350 మంది పెన్షనర్లు వున్నారని వారికి సంబంధించిన ప్రధాన సమస్యలు పరిష్కరించాలని మంగళవారం వినతిపత్రం అందించామని పెన్షనర్స్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురు రాజారావు తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫారం16 ,26ఏ ఇవ్వాలని,పెన్షనర్ల పేస్లిప్పులలో ఫ్యామిలీ పెన్షనర్ల పేరు, పుట్టిన తేదీ లేని వారి వివరాలు నమోదు చేయాలని, చనిపోయిన పెన్షనర్లకు చెల్లించవలసిన దహన సంస్కారాల సొమ్ము గత ఆరు నెలలుగా చెల్లించలేదని, ఈహెచ్ఎస్ పథకంలో భార్యాభర్తలు ఇద్దరి వద్ద సభ్యత్వం రికవరీ చేస్తున్నారని అది ఒకరికి పరిమితి చేయాలని తెలిపారు. దీనిపై ఎస్‌టిఓ స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


తహశీల్దారును సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

రొంపిచర్ల తహశీల్దారు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం నూతన తహశీల్దారుగా అమరనాథ్ మంగళ వారం బాధ్యత లు చేపట్టారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి బదిలీ పై రొంపిచర్ల మండలా నికి వచ్చారు. ఈయనను కార్యాలయ సిబ్బంది స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహశీల్దారు పి కిరణ్ కుమార్, ఆర్ఎస్ డిటి లోకేష్, సీనియర్ అసిస్టెంట్ ముబారక్, శిరీష, ఇర్ఫాన్ శుభాకాంక్షలు తెలిపారు.